క్లుప్తంగా

పాత పెన్షన్ అమలు చేయాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): 2003 డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీప్రసాద్ పేర్కొన్నారు. ఈ అంశంపై ఈనెల 25న విజయవాడలో జరిగే యూటీఎఫ్ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు అరవింద్, కాశీం, జాన్సన్, వెంకటేష్, సుకుమార్, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన నాయక్ షబ్బీర్ (31) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ నెల 17వ తేదీన ఇంటిలో ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఊర్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈమేరకు ఆ యువకుడి భార్య షబానా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య బుధవారం తెలిపారు.

తప్పిన ప్రమాదం



చెట్టును ఢీ కొన్న లారీ

దొర్నిపాడు: ఓ లారి అదుపు తప్పి చెట్టు ఢీకొన్న ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట–దొర్నిపాడు మధ్య బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. బేతంచెర్ల నుంచి చెన్నైకి దొర్నిపాడు, ఆళ్లగడ్డ మీదుగా వెళ్లేందుకు లారీ బయలు దేరింది. వర్షంలో లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. అయితే ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోగా క్రేన్ సాయంతో లారీని బయటకు తీశారు.


సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో సీపీఆర్ నేర్చుకుందాం .. నిండు ప్రాణాన్ని కాపాడుదాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం వైద్యులు డాక్టర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయన్నారు. గుండెపోటుతో మరణించేవారి సంఖ్య పెరిగిపోతుందన్నారు. శ్వాస తీసుకోవడం ఆగిపోయినప్పుడు వారి ప్రాణాలను కాపాడటానికి ఒక అత్యవసర చికిత్స సీపీఆర్ అన్నారు. మణిదీప్, ధ్రువన్‌రెడ్డి అతి చిన్న వయస్సులోనే ఆదర్శ సేవా దృక్పథంతో అమెరికా నుంచి భారత్‌కు వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో పాఠశాలలను సందర్శించి విద్యార్థులందరికీ సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 18, 19 తేదీల్లో జరిగిన రాయలసీమ జోనల్ లెవెల్ బాక్సింగ్ పోటీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ చాపిరేవుల విద్యార్థి బి.వెంకట్ యశ్వంత్‌రెడ్డి ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు, పీఈటీ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆ విద్యార్థిని వారు అభినందించారు. త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

అవార్డు గ్రహీతకు అభినందన

నంద్యాల(న్యూటౌన్): స్టేట్ లెవెల్ అకాడమిక్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ 2025 అవార్డు గ్రహీత షేక్షావలిరెడ్డిని నంద్యాల జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి పుల్లయ్య బుధవారం శాలువా కప్పి అభినందించారు. గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి విద్యార్థులకు చదువు, క్రీడా రంగంలో సేవలు అందించడంతో రాష్ట్రస్థాయి అవార్డు రావడం అభి నందనీయమన్నారు. ఇలాంటి అవార్డులు ఆయన మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు.

100 % అన్యాయం



ఇక్కడ మంచం పై పడుకుని ఉన్న వ్యక్తి పద్మనాభయ్య. చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన ఇతనికి రెండు కిడ్నీలు పాడైపోయాయి. నెల నెలా డయాలసిస్ చేసుకోవాలి. మంచానికే పరిమితమైన ఇతనికి నాలుగు సంవత్సరాల నుంచి మెడికల్ పింఛన్ అందుతోంది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పింఛన్‌ను రూ. 15 వేలకు పెంచింది. అయితే ఇప్పుడు ఏమైందో ఏమో ఉన్నట్టుండి రూ. 6 వేలకు తగ్గిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడంతో ఇలాంటి పరిస్థితిలో ఏం చేయాలని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

ఎందుకు తొలగించారో..



మంచంపై పడుకుని ఉన్న ఇతను చాగలమర్రి మండలం పెద్ద వంగళి గ్రామానికి చెందిన యేసేబు. నాలుగు సంవత్సరాల క్రితం పక్షవాతానికి గురవడంతో మంచానికే పరిమితమయ్యాడు. డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్‌తో 3 ఏళ్లుగా వికలాంగుల పింఛన్ అందుకుంటున్నాడు. ఇప్పుడు ఉన్నట్టుండి పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అంగ వైకల్యం ఉన్నా..



సరిగ్గా నిల్చోడానికి కూడా ఇబ్బంది పడుతున్న ఇతను సురేంద్ర. దొర్నిపాడు గ్రామానికి చెందిన ఇతను పుట్టుకతో మానసిక దివ్యాంగుడు, రెండు కాళ్లు వంకర్లు పోయి (దొడ్డి కాళ్లు) నడవడం కాదు కాదా కనీసం నిల్చోవడానికి కూడా ఇబ్బంది పడుతుంటాడు. నా అన్న వారు ఎవరూ లేరు. వైకల్యం 90 శాతం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో గత ప్రభుత్వం ఇతనికి దివ్యాంగ పింఛన్ మంజూరు చేసింది. ఐదేళ్లుగా ఈ పింఛనే ఆధారం. కాని కూటమి సర్కారు 40 శాతం కంటే తక్కువగా వైకల్యం ఉందని పింఛన్ రద్దు చేసింది.

దివ్యాంగ నుంచి వృద్ధాప్యంగా మార్పు



ఇక్కడ సొంతంగా నడవలేక స్టాండ్ పట్టుకుని నడుస్తున్న ఈ మహిళ పేరు మైసమ్మ. చాగలమర్రిలోని భవనిపురం కాలనీకి చెందిన ఈమెకు రెండు కాళ్లు సచ్చుపడి పోవడంతో డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా వికలాంగుల పింఛన్ రూ. 6 వేలు అందుకుంటోంది. ఇప్పుడు నీకు ఎలాంటి వికలత్వం లేనందున వృద్ధాప్య పింఛన్‌గా మార్పు చేశామని నోటీసు ఇవ్వడంతో ఆవేదన చెందుతోంది.

పింఛన్... వంచించెన్ !

- దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు 'పచ్చ' జెండా
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా కుట్రలు
- అనర్హత పేరిట నోటీసులు
- జిల్లాలో వేలాది మందికి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు
- విలపిస్తున్న దివ్యాంగులు, కుటుంబ సభ్యులు
- నోటికాడి కూడు లాక్కుంటున్నారంటూ శాపనార్థాలు



కిష్టిపాడు సచివాలయం దగ్గర నోటీసులు అందుకున్న దివ్యాంగులు

ఆళ్లగడ్డ: కొండంత రాగం తీసి గోరంత పాట పాడిన చందంగా మారింది చంద్రబాబు దివ్యాంగులకు అందజేసే పింఛన్ల తీరు. అధికారం కోసం పింఛన్ బారీగా పెంచుతామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత పెంచినట్టు కనికట్టు చేసి.. నిరుపేదలు, అట్టడుగు వర్గాలకు చెందిన దివ్యాంగుల పింఛన్లకు లేనిపోని నిబంధనలు పెట్టి అడ్డగోలుగా కోత పెట్టారు. నీకు నెలనెలా అందుతున్న పింఛన్ ఎందుకు కట్ చేయకూడదు ? అంటూ నోటీసులు అందజేస్తున్నారు. ఇలా నోటీసుల ద్వారా జిల్లా వ్యాప్తంగా 7 వేలకు పైగా దివ్యాంగుల పింఛన్లను పీకేసినట్లు తెలుస్తోంది. నడవలేని స్థితిలో ఉన్నవారు, కేవలం మంచానికే పరిమితమైన ఇతరులపై ఆదారపడ్డ వారు, పుట్టు అంధులు, దివ్యాంగులు పింఛన్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న అభాగ్యులు సర్కారు తీరు పట్ల గగ్గోలు పెడుతున్నారు.

నమ్మించి మోసం

అధికారంలో లేనప్పుడు ఒకలా.. అధికారం చేపడితే మరోలా మాట్లాడటం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికల సమయంలో కూటమి మేనిఫెస్టోలో భాగంగా అప్పటి వరకు దివ్యాంగులకు ఇస్తున్న 3 వేల పింఛన్‌ను అధికారంలోకి రాగానే రూ. 6 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. రూ 6 వేలు పెంచినట్లే పెంచి లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోతలు పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. రీ వెరిఫికేషన్ అంటూ దివ్యాంగులందరినీ వైద్యపరీక్షల కోసం ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. అందులో వేలాది మందిని అనర్హులుగా చేసే కుట్రకు తెరలేపారు. గతంలో ఇచ్చిన డాక్టర్ సర్టిఫికెట్‌లో 100, 90, 80 శాతంగా ఉన్న వైకల్యాన్ని అడ్డంగా ఆ శాతాలకు కోత విధించి కొందరికి 40 శాతం కన్నా తక్కువగా ఉందని నోటీసులు ఇవ్వడం ఒక ఎత్తైతే మరి కొందరికి ఏకంగా వీరికి ఎలాంటి వైకల్యం లేదు అని ధ్రువీకరించినట్లు నోటీసులు ఇవ్వడం గమనార్హం. జిల్లాలో 25,256 మంది దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు ఉండగా ఇంతవరకు సుమారు 22 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ప్రస్తుతానికి 4,099 మంది దివ్యాంగులకు అనర్హులుగా పేర్కొంటూ మీ పింఛన్లు తొలగిస్తున్నామని నోటీసులు జారీ చేశారు. రూ వేలు పింఛన్ అందుకుంటున్న మరో 719 మంది దివ్యాంగులను వృద్ధాప్య పింఛన్ దారులుగా మార్పు చేసి రూ. 4 వేల పింఛన్ లబ్ధిదారులుగా మార్పు చేశారు. రూ 10 వేల నుంచి రూ. 15 వేల వరకు అందుకుంటున్న హెల్త్ పింఛన్‌దారులు 873 మంది ఉన్నారు. వీరందరినీ వెరిఫై చేసిన ప్రభుత్వం ఇందులో 64 మంది అనర్హులుగాను, 323 మందిని దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారులుగా (రూ 6 వేలు), మరో 20 మందిని వృద్ధాప్య పింఛన్ (4 వేలు) లబ్ధిదారులుగా మార్పు చేశారు. దీంతో ఒక్కొక్కరికి రూ. 9 వేల నుంచి రూ. 11 వేల వరకు నెలనెలా కోత పడనుండటంతో దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు లబోదిబో మంటున్నారు. ఈ నెల 27 నాటికి తొలగింపు ప్రక్రియ పూర్తిచేసి సెప్టెంబర్ 1వ తేదీ నాటికి కొత్త జాబితా సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

పునః పరిశీలనకు వెళ్ల వచ్చు

నోటీసులు అందుకున్న లబ్ధిదారులు స్థానిక ఎంపీడీఓల దగ్గరకు వెళ్లి అభ్యంతరాలుంటే తెలపవచ్చు. వీరందరికీ మరో సారి వైద్య పరీక్షలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

– శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

తొలగించేందుకు సామాన్యులపై వైఎస్సార్‌సీపీ ముద్ర

ప్రస్తుతం పింఛన్ తొలగింపు నోటీసులు అందుకున్న దివ్యాంగ పింఛన్ లబ్ధి దారులు దాదాపు అందరు పేదలు, సామాన్యులే. అయితే, వీరిలో చాలా మంది వైఎస్సార్‌సీపీకి మద్దతుదారులుగా ఉన్నారు. దీనిని జీర్ణించుకోలేని కూటమి సర్కారు నిబంధనల పేరుతో తొలగించేందుకు కుట్రలు పన్నుతోంది. ఆళ్లగడ్డ మండలంలోని ఓ గ్రామంలో 30 మంది దివ్యాంగ పింఛన్ దారులు ఉండగా ఏకంగా 11 మంది పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. ఇందులో ఇద్దరు పుట్టుకతో దివ్యాంగులు 100 శాతం వైకల్యం ఉన్నట్లు డాక్టర్ సర్టిఫికెట్‌లు ఉన్నాయి. వీరందరి పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. కాగా ఈ 11 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ సానుబూతి పరులనే కుట్రచేశారని బాధితులు వాపోతున్నారు. ఇదే గ్రామంలో కాలికి చిన్న గాయమై దివ్యాంగు పింఛన్ పొందుతున్న వ్యక్తికి మాత్రం అధికారులు నోటీసులు ఇవ్వలేదు. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన అంశంలోనూ కూటమి సర్కారు వివక్ష చూపుతుందని గ్రామాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

విద్యారంగ సమస్యలపై పోరాటం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో చలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీలు, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. జీవో నం.77ను రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులంతా ఈ ఆందోళనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కిశోర్, సాయి, రోహిత్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు

చాగలమర్రి: లగోరి ఆటల పోటీల్లో చాగలమర్రిలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జీవయ్య తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులు నిరంజన్, హరి, నరసింహులును బుధవారం పాఠశాలలో అభినందించి మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరులో మేధా డిఫెన్స్ అకాడమీ నిర్వహించిన రాష్ట్రస్థాయి లగోరి పోటీలలో సీనియర్స్ బాలుర విభాగంలో నంద్యాల జట్టు మూడవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ జట్టు లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురు ఉన్నారన్నారు. త్వరలో మహరాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో మన రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఐడీకే శాస్త్రి, పీడీ శ్రీనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, నారాయణమూర్తి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరుగుతున్న కంప్యూటర్ స్కిల్ అండ్ ఎంఎస్ ఆఫీసు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ నంద్యాల జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు దానిని అందిపుచ్చుకోవాలని సూచించారు. కంప్యూటర్ ఉద్యోగాల్లో రాణించాలంటే విద్యార్థులకు నైపుణ్యాలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి

నంద్యాల(అర్బన్): పేద, వెనుకబడిన రెడ్డి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్య రుణాలు సక్రమంగా అందించేందుకు తక్షణమే రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై. సురేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పేద రెడ్డి కుటుంబాల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి కోసమే రెడ్డి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు జరిగిందన్నారు. రాష్ట్రంలో 50లక్షల మంది ఈ వర్గానికి చెందిన వారు ఉన్నారన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రుద్రవరం:మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన లక్ష్మి(37) అనే మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీ మద్యానికి బానిసయ్యారు. దీనిని మానలేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 19న రసాయన ద్రావణం తాగారు. కుటుంబీకులు గమనించి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. భర్త సుబ్బనర్సయ్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తమ్ముడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

నంద్యాల(న్యూటౌన్): వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు కనీసం రూ.25 వేలు ఇవ్వాలని ఆటో డ్రైవర్ల వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం మీనాక్షి సెంటర్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 30 వేలకు పైగా ఆటోలు ఉన్నాయని, వాటిని నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టి ఆటో కార్మికుల కడుపు కొడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 21వ తేదీన సీఐటీయూ కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించినున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ అండ్ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి ముజఫర్ అహమ్మద్, కర్నూలు జిల్లా కార్యదర్శి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

దోమతెరలు వాడండి



ప్రతిజ్ఞ చేస్తున వైద్య సిబ్బంది

చాగలమర్రి: దోమల నుంచి రక్షణకు దోమతెరలు వాడాలని చాగలమర్రి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.అంజలి అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో దోమల నుంచి రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం దోమల జీవిత చక్రాన్ని కనుగొన్న సర్.రోనాల్డ్‌రాస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, సీహెచ్ఓ రవణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంపీహెచ్ఈఓలు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస నాయక్, ఫార్మసిస్ట్ రాజేష్, హెల్త్ అసిస్టెంట్ మనోహరమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్వర్గధామం సేవకులకు కిట్ల పంపిణీ



స్వర్గ ధామం సేవకులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల పీవీ నగర్ మున్సిపాలిటీ హిందూ శ్మశాన వాటిక (స్వర్గధామం) కాటికాపరులకు బుధవారం రెడ్ క్రాస్ సొసైటీ, ఐఎంఏ నంద్యాల ఆధ్వర్యంలో వంట సామగ్రి, దోమతెరలు, దుప్పట్లు, ప్లాస్టిక్ బకెట్లు తదితర వస్తువులతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ 11 మందికి ఈ కిట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు దస్తగిరి, నాగేశ్వరావు, ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కో–ఆర్డినేటర్ ఆనంద్ గురూజీ, రామ ప్రసాద్, వసంతు నరసింహ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా వినాయక చవితి



వినాయక చవితి ఉత్సవ కరపత్రాలు విడుదల చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 27 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాలు పర్యావరణ హితంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యుడు బుగ్గన చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రంలో కొత్తగా ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పడింది అని, దానికి అనుబంధంగా జిల్లా కమిటీలు, తాలూకా కమిటీలు, మండల కమిటీలు, గ్రామ కమిటీలు ఒకదాని ఒకటి అనుసంధానించబడి ఈ సంవత్సరం వినాయక చవితిని ఎటువంటి సమస్యలు, ఆటంకాలు లేకుండా తగిన జాగ్రత్తలతో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం సింగిల్ విండో పద్ధతిలో వినాయక మండప నిర్వాహకులకు అన్ని సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు రామాంజనేయులు, పోలేపల్లి సందీప్, ఎర్రం విష్ణు వర్ధన్‌రెడ్డి, అభిరుచి మధు, రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, జిల్లా స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి





రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు,సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయ శేఖర్

దొర్నిపాడు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల్లో రైతులు తప్పని సరిగా పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు రవిప్రకాష్‌రెడ్డి, వెంకటరమణమ్మ సూచించారు. బుధవారం రామచంద్రాపురం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు పాల్గొని మినుము, పత్తి, కంది పంటలను పరిశీలించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా పొలాల్లో నీటి నిల్వలు ఉండే వెంటనే తొలగించి జాగ్రత్తలు పాటించాలన్నారు. యూరియా, పొటాష్, చల్లాలని వివరించారు. రైతులంతా రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రమీల, వీఏఏ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయండి

చాగలమర్రి: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని ఆళ్లగడ్డ ఏడీఏ విజయ శేఖర్ సూచించారు. బుధవారం ఏఓ రంగనేతాజి ఆధ్వర్యంలో చాగలమర్రిలోని చింతలచెరువు రస్తాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగు విధానం, చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

నానో యూరియాను వినియోగించాలి

గోస్పాడు: నానో యూరియాను వాడి వ్యవసాయాన్ని సులభతరం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని పసురపాడు గ్రామంలో నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరత..అన్నదాతల వెత!



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు లక్ష్మీ రెడ్డి. క్రిష్టిపాడు గ్రామంలో 6 ఎకరాలు ఉండగా మూడెకరాల్లో వరి సాగుచేశాడు. మిగతా మూడెకరాల్లో వరిని నాటేందుకు ఏర్పాట్లు చేసుకున్నా యూరియా దొరక్క అవస్థలు పడుతున్నాడు. ఇప్పటికే సాగుచేసిన వరికి యూరియా అవసరం కావడంతో మార్కెట్లో బ్లాక్‌లో కొనుగోలు చేశాడు. రూ. 300 బస్తాకు రూ.900 వెచ్చించి తెచ్చుకున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. లక్ష్మిరెడ్డి ఒక్కరే కాదు మండలంలో చాలా మంది రైతుల యూరియా కోసం అవస్థలు పడుతున్నారు.



దొర్నిపాడు లో యూరియా లేక రంగుమారిన మొక్కజొన్న

దొర్నిపాడు:యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు పాలకులకు, అధికారులకు పట్టడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మినుము, మొక్కజొన్న, కంది, వరి పంటలు రంగుమారాయి. ఈ పంటలను కాపాడుకునేందుకు యూరియా చల్లాలని అధికారులు చెబుతున్నారు. యూరియా కోసం వెళ్తే ఎక్కడ చూసినా నోస్టాక్ బోర్డులే కరిపిస్తున్నాయి. గతంలో సహకార సంఘం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ముందస్తుగా రైతుల కోసం ఇండెంట్ పెట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కారణమేమిటని ప్రశ్నిస్తే అధికారుల నుంచి సమాధానం లేదని రైతులు వాపోతున్నారు.

అధికారులు స్పందించడం లేదు



యూరియా కావాలని అధికారులను అడిగితే స్పందించడం లేదు. మండలంలో విస్తారంగా మినుము, వరి, మొక్కజొన్న సాగు చేశారు. ఈ పంటలకు ప్రస్తుతం యూరియా అవసరం. ప్రభుత్వం ఎందుకు సరఫరా చేయడం లేదో తెలియడం లేదు. గతంలో ఆర్బీకే, సహకార సంఘాల్లో పుష్కలంగా లభించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లో మూడింతల రెట్టింపు ధరతో విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలి.

–శివరామిరెడ్డి, రైతు, క్రిష్టిపాడు